# "బాండెడ్" లేబర్

మబ్బు తలుపులు తెరచుకొని తన డ్యూటీకి బయలుదేరుతున్నాడు సూర్యుడు.

హడావిడిగా డ్యూటీకి బయలుదేరుతూ, షూ లేసు వేసుకొంటున్న నేను చీపురు చప్పుడు విని తలఎత్తి చూశాను.

గుమ్మం తుడిచి ముగ్గు పెడుతున్నది మా ఆవిడ. "అదేంటీ. పనిమనిషి రాలేదా?" అడిగాను.

"అది వస్తే నాకెందుకండి ఈ శ్రమ" మా ఆవిడ చిరాగ్గా అంది. "అది పని మానేసిందండీ"

పని మానేసిందా! నాకు ఆశ్చర్యం వేసింది.

"దానికేం మాయరోగం వచ్చింది, పని మానేయటానికి- మొన్నే కదా కొత్తచీర, జాకెట్టు ఇచ్చాము."

"ఊరకనే ఇచ్చేమేంటి కొత్తచీర. సంవత్సరం పాటు పనిచేసింది కనుక ఇచ్చాము" మా ఆవిడ విసుగ్గా అంది "సంవత్సరం అయిందనీ జీతం పెంచమనీ అడిగింది కదండీ."

"పెంచలేకపోయావా?"

"పెంచుదామనే అనుకున్నాను. మీకు చెప్పేను కదా? కానీ మీరేం అనలేదు......"

నిజమే మొన్న డ్యూటీ నుంచి రాగానే మా ఆవిడ చెప్పింది. పనిమనిషి జీతం పెంచమని అడుగుతోందని.

సంవత్సరం పర్యిసయింది కనుక దానికి కనీసం పది రూపాయలయినా ఇంక్రిమెంటు కావాలట!

ఆ రోజు డ్యూటీ నుంచి చాలా చిరాగ్గా ఇంటికి వచ్చాను. ఎవరితోనూ మాట్లాడాలని అనిపించలేదు. మా ఆవిడ మాటలన్నిటికి ఊ కొట్టాను కానీ ఆవిడ చెప్పింది ఏదీ నా బుర్రకెక్కలేదు.

ఎంత మర్చిపోదామనుకున్నా డ్యూటీలో సంఘటనే గుర్తుకొచ్చింది.

పనిలో మునిగివున్న నేను, బాస్ పిలిస్తే అతని రూమ్‌కి వెళ్లాను.

"కమిన్. మిస్టర్ శేఖర్." బాస్ నవ్వుతూ ఆహ్వానించాడు. కుశలప్రశ్నలు వేశాడు. పని ఎలా జరుగుతున్నదని అడిగేడు. ఆ తర్వాత మెల్లగా అన్నాడు. "చూడండి మిస్టర్ శేఖర్ మీరు చాలా కష్టపడి పనిచేస్తారు. మీమీద నాకు చాలా నమ్మకం వుంది. ఇన్ ఫేక్ట్, మీ బేచ్ ఇంజనీయర్స్‌లో మీరే బెస్టని కూడా నాకు తెలుసు."

అతను ఇవన్నీ నాకెందుకు చెబుతున్నాడో నాకర్థంకాలేదు. "నేనే-మన్నా పొరపాటు చేసానా?"

"నో. నో. నో. మీరు పొరపాటు చేయుటమా?"

"మరేంటిసార్, మీరు అంటున్నది."

"మరేంలేదు మిస్టర్ శేఖర్. ఈ సంవత్సరం మీకు ఇంక్రిమెంటు ఇవ్వవద్దని హెడ్డాఫీసు నుంచి ఆదేశాలొచ్చాయి"

షాక్ తగిలినట్లయింది నాకు. ఓ నిముషం సంబాళించుకొని అడి-గేను, "నేనేమైనా తప్పుచేశానా సార్? చెప్పిన పని ఏదైనా చెయ్యలేకపోయానా?"

"అదేం లేదు మిస్టర్ శేఖర్. నేను మీపనితనాన్ని ఎంతో మెచ్చు-కుంటున్నాను. కానీ నేనేం చెయ్యగలను? మీకేకాదు మీ బేచ్‌లో ఎవరికీ ఇంక్రిమెంట్లు ఇవ్వవద్దన్నారు."

పని చెప్పడం తప్ప తనదగ్గర పని చేసేవారి కష్టసుఖాలు, మంచి-చెడ్డలు చూడటం చేతకాని మాబాస్ చేతులెత్తేసాడు.

ఉద్యోగం మానేయాలనిపించింది. సంవత్సరం అంతా బాస్ మెచ్చుకొనేలా పనిచేసినా, ఇంక్రిమెంటు కూడా ఇవ్వని యాజమా-న్యానికి నా శక్తిసామర్థ్యాలు ధారపోయటం పొరపాటనిపించింది.

కానీ ఎలా మానగలను? ఐదు సంవత్సరాలు సర్వీసు చేస్తానని వ్రాసి ఇచ్చిన "బాండ్" గుర్తుకొచ్చింది. ఉద్యోగం మానివేస్తే నష్ట-పరిహారం కట్టాలి.

రాత్రంతా అటూఇటూ దొర్లి పడుకున్నాను. గానీ నిద్రపట్టలేదు.

కార్మిక సంక్షేమ పథకాలెన్నో అమలుపరుస్తున్నారని పొంగిపోతున్న ఈ దేశంలో నాకీ అన్యాయం ఏమిటీ?

పదిరోజులు సెలవు పెట్టి కసి తీర్చుకోవాలి అనుకున్నాను. గానీ మరునాడే మామూలుగా డ్యూటీకి వెళ్ళాను.

మూడు గంటలకు డ్యూటీ దిగే టైమ్‌కు బాస్ వచ్చాడు షాపుకి.

"చూడు మిస్టర్ శేఖర్, నేను పొద్దున్న రిపేర్‌కిచ్చిన రెండు పంపులు రేపటికల్లా తయారై పోవాలి. లేటైనాసరే నువ్వు దగ్గర ఉండి పనిపూర్తిచేసి వెళ్ళాలి. ఓ.కే." ఆర్డరు జారీచేసాడు బాస్.

మనసులో తిట్టుకున్నా పని అయేంతవరకు ఉండకతప్పలేదు. "బాండెడ్" లేబర్‌ని కదా!

రాత్రి పన్నెండు గంటలవరకు పనిచేసి అలసిపోయి వచ్చి పడుకున్నాను.

పని మనిషి ఇంక్రిమెంటు సంగతి మర్చేపోయాను.

"ఏదో సర్దిచెప్పలేకపోయావా" లేసు వేసుకోడం పూర్తిచేసి అన్నాను.

"ఏం చెప్పనండీ. సంవత్సరానికి పది రూపాయిలన్నా ఇంక్రిమెంటు ఇవ్వని ఇంట్లో పని చెయ్యనని చెప్పిందండీ."

ఆ మాటలు నన్ను ఎగతాళిచేసినట్లు తోచింది.

"పోనీ మళ్ళీ రమ్మని కబురుపెట్టు."

"అది ఇంకోపనిలో చేరిపోయిందండి. మీలాంటి ఉద్యోగాలేంటండీ వాళ్ళకి, ఒకటిపోతే ఇంకోటి దొరక్కపోవటానికి."

శూలంతో పొడిచినట్లయింది నాకు. ఏ కార్మిక సంక్షేమ పథకాలు లేనటువంటి వాళ్ళ బ్రతుకులే బాగున్నాయనిపించింది.

స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో చేసే పనిలో వున్న సంతృప్తి, పనితనం, నిర్బంధపు పనిలో వస్తాయని అనుకోవటం నాదే పొరపాటు.

పని మనుషుల కుండే పాటి ఆత్మాభిమానం కూడా నాకు వుండ కూడదనుకున్నాను.

లేచి నుంచున్నాను.

మెట్లు దిగుతుంటే పేపరందించేడు పేపర్ బాయ్.

"వందమందికి వెట్టిచాకిరి నుంచి విముక్తి" అని పేపరు మొదటి పేజీలో కనిపించిన అక్షరాలు నన్ను చూసి వికృతంగా నవ్వేయి.

* * *

(ఉదయం వారపత్రిక 10-8-90 సంచికలో ప్రచురితం)